క్లుప్తంగా

పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్‌గా రామారావు



రామారావు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపల్ కమిషనర్‌గా ఎన్.రామారావు నియమితులయ్యారు. ఈయన విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తూ కమిషనర్‌గా బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన నాగేంద్రకుమార్‌ను బదిలీ చేస్తూ విజయవాడ వరదల ప్రాంతంలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ బాధ్యలను ప్రభుత్వం అప్పగించింది. నూతన కమిషనర్ రామారావు సోమ లేదా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు యశోద

సోంపేట: సోంపేట మేజర్ పంచాయతీలోని నేతాజీనగర్‌లో జెడ్పీటీసీ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద భూమి పూజ ఆదివారం చేశారు. పంచాయతీ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యులు బొమ్మిడి ధర్మరావు, పొడుగు కామేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రేగు బాలయ్య, మల్లా వెంకటరావు, దొండపాటి శ్రీను ఉన్నారు.

సుబ్బమ్మపేటలో వైద్య శిబిరం



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ అనితకుమారి

నందిగాం: మండలంలోని మెండ్రాయివలస పంచాయతీ సుబ్బమ్మపేటలో నందిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యురాలు కె.అనితకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో 47 మంది రక్త పరీక్షలు చేశారు. వీరిలో ఐదుగురికి జ్వరం ఉన్నట్లు గుర్తించి మందులు అందజేశారు. పీహెచ్‌ఎన్ నాగమణి, ఎంపీహెచ్‌ఏలు పోలయ్య, ప్రశాంతి, ఏఎన్‌ఎం క్రిష్ణవేణి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్ నిలయం అభివృద్ధికి సహకరించాలని వినతి



ఎమ్మెల్యే మనోరంజన్‌ధ్యాన్ సామంత్‌రాయ్‌తో రైల్‌యూజర్ కమిటీ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం రైల్ నిలయం అభివృద్ధికి సహకరించాలని స్థానిక రైల్ యూజర్ కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఒడిశా రాష్ట్రం చీకటి నియోజకవర్గ ఎమ్మెల్యే మనోరంజన్‌ధ్యాన్ సామంత్‌రాయ్‌ని ఆదివారం కలిసి విజ్ఞప్తి చేశారు. రైల్ నిలయం సమీపంలోని ఎల్‌సీగేట్ వద్ద ఓవర్‌బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. బ్రిడ్జి నిర్మాణం చేపడితే ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలకు చెందిన 80 గ్రామాల ప్రజలకు ఉపయోగంగా ఉంటుందని వివరించారు. ఎమ్మెల్యే కలిసిన వారిలో జెడ్‌ఆర్‌యూసీ సభ్యులు కట్టా సూర్యప్రకాష్, అలీమ్‌ఖాన్, ఉల్లి రాజు ఉన్నారు.

సామూహిక మాలధారణ



లలితాశ్రమంలో భవానీభక్తులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కోసంగిపురం కాలనీ లలితాశ్రమంలో పలువురు సామూహిక మాలధారణ ఆదివారం చేపట్టారు. గురు భవానీ సువ్వారి చిన్నిక్రిష్ణ సమక్షంలో 21 మంది భవానీ మాలలు ధరించారు. దేవీ నవరాత్రులు పూర్తయ్యేంత వరకు భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నారు. లలితాదేవి ఆలయంలోని సన్నిధానంలో దీక్షలు కొనసాగిస్తారు.

తెప్పలకు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం



కృష్ణమూర్తిని సత్కరిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాసకు చెందిన సీనియర్ రచయిత, నటుడు, జనజాగృతి సాహితీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి అత్యంత ప్రతిష్టాత్మకమైన జీవిత సాఫల్యం పురస్కారం దక్కింది. కృష్ణమూర్తి సాహితీ రంగం, లయనిజంలో మూడు దశాబ్దాలుగా విశిష్ట సేవలందిస్తున్నందుకు హైదరాబాద్‌లోని డాక్టర్ దేవులపల్లి ఆదర్శ కళా నిలయం ప్రతినిధులు పురస్కారాన్ని ఆదివారం అందించి సత్కరించారు.

చినుకు పడితే వణుకే..

చినుకుపడితే రోడ్లు జలమయమవుతున్నాయి. కొద్దిపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలిచిపోతుండడంతో ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి పలాస మండలం టెక్కలిపట్నం, వజ్రపుకొత్తూరు మండల కేంద్రాన్ని కలిపే రోడ్లు రూపురేఖలు కోల్పోయాయి. కొండలపై ఏమాత్రం వాన పడిన నీరంతా రోడ్లపైకి చేరుతుండడంతో కోతకు గురవుతున్నాయి. ఆర్‌అండ్‌బీ అధికారులు వరద నీటిని మళ్లించే ప్రయత్నం చేయకపోవడంతో రోడ్లు మరింత అధ్వానంగా తయారవుతున్నాయి. పలాస నుంచి నువ్వలరేవు, పూండి, బెండిగేటు, అక్కుపల్లి గ్రామానికి అనుసంధానంగా ఉండే రోడ్లన్నీ వర్షం నీటితో ప్రమాదకరంగా మారాయి. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

– వజ్రపుకొత్తూరు/కాశీబుగ్గ



బెండికొండ వరద నీటితో పాడైన నువ్వలరేవు-టెక్కలిపట్నం రోడ్డు



బెండిగేటు వద్ద రోడ్డు దుస్థితి ఇలా..



గల్లి గ్రామంలో అధ్వానంగా రోడ్డు



బెండిగేటు దత్తాత్రామానికి సమీపంలో..



శివరాంపురం గ్రామానికి వెళ్లే రోడ్డు..



గల్లి హైస్కూల్ ఎదుట రోడ్డుపై నిలిచిన నీరు

వంద రోజుల్లోనే.. కూటమి సర్కార్‌పై ప్రజా వ్యతిరేకత

- స్థానిక సంస్థల్లో మనమే బలంగా ఉన్నాం
- ఎవరూ అధైర్యపడొద్దు..ప్రతిఒక్కరికీ అండగా ఉంటాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్



మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

టెక్కలి: మోసపూరితమైన హామీలతో అధికారం దక్కించుకున్న కూటమి ప్రభుత్వంపై వంద రోజుల పాలనలోనే ప్రజల్లో వ్యతిరేకత చోటు చేసుకుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. కోటబొమ్మాళిలో వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో ముఖ్య కార్యకర్తలు, నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ప్రభుత్వం అధికారంలో లేదని ఏఒక్క కార్యకర్త నిరాశ చెందవద్దన్నారు. స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని భరోసా కల్పించారు. టెక్కలి నియోజకవర్గంలో పేరాడ తిలక్ నాయకత్వంలో ప్రతి కార్యకర్త పోరాటం చేయాలని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన సమావేశంలో చెప్పారని కృష్ణదాస్ గుర్తు చేశారు. ముఖ్యంగా టెక్కలి నియోజకవర్గంపై ప్రత్యేకమైన దృష్టి సారించాలని జగన్ చెప్పారని పేర్కొన్నారు. సూపర్‌సిక్స్ హామీలతో పాటు ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకునే విధంగా కూటమి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రజల తరఫున పోరాటాలు చేయాలని కోరారు. సూపర్ సిక్స్ హామీలపై ప్రజలు నిలదీస్తారనే భయంతో రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు లేనిపోని కుట్రలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. జిల్లాలో ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామని.. ఈ విషయంలో ఎవరూ అధైర్యపడొద్దని భరోసానిచ్చారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మాట్లాడుతూ.. అబద్ధపు హామీలతో అధికారం దక్కించుకున్న కూటమి నాయకుల బెదిరింపులకు తలొగ్గేది లేదన్నారు. స్థానిక సంస్థల్లో మనకున్న బలంతో కూటమి నాయకుల కుట్రలను తిప్పికొడదామని పిలుపునిచ్చారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై తిరుగుబాటు ఆరంభమైందన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలకు చేసిన మోసాల్ని వివరించడానికి పార్టీ కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షునిగా కృష్ణదాస్, టెక్కలి ఇన్‌చార్జిగా తిలక్‌ను నియమించడంపై నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ వారిని సత్కరించి అభినందించారు. సమావేశంలో డీసీసీబీ మాజీ అధ్యక్షుడు కె.రాజేశ్వరరావు, కోటబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు డి.వెంకట్రావు, నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, నాయకులు రోణంకి మల్లయ్య, ఎ.రామారావు, పి.వెంకట్రావు, ఎస్.సంజీవరావు, ఎన్.సత్యరాజ్, ఎస్.హేమసుందర్‌రాజు, వై.చక్రవర్తి, టి.ఫాల్గుణరావు, ఎ.రాహుల్‌తో పాటు పలువురు నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



కృష్ణదాస్, తిలక్‌ను సన్మానిస్తున్న నాయకులు

బారువ రైల్వేస్టేషన్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి



మాట్లాడుతున్న విశ్రాంత డీఎస్పీ ఎస్.వి.వి.ప్రసాద్

సోంపేట: బారువ రైల్వేస్టేషన్ అభివృద్ధికి ప్రజలంతా సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని బారువ రైలు నిలుపుదల సాధన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కొర్లాం గ్రామంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం సాధన కమిటీ ప్రతినిధి శ్రీనువాసరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. విశ్రాంత డీఎస్పీ ఎస్.వి.వి.ప్రసాద్, జెడ్.ఆర్.ఆర్.సి. సభ్యుడు సూర్యప్రకాష్ తదితరులు మాట్లాడుతూ.. పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు కృషి చేస్తే రైల్వే స్టేషన్ అభివృద్ధి చెందుతోందన్నారు. తమవంతు సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు. పరిసర గ్రామాల వ్యక్తులు సూరాడ చంద్రమోహన్ , తడక జోగారావు, మద్దిలి నాగేశ్వరరావు, బతకల మోహనరావు తదితరులు మాట్లాడుతూ.. తీర ప్రాంత, గిరిజన ప్రాంతాల ప్రజలకు రైల్వే స్టేషన్ ఉపయోగ పడుతుందన్నారు. మొదటి విడతగా పాసింజర్ రైళ్ల నిలుపుదలకు కృషి చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వానికి, రైల్వే అధికారుల దృష్టికి సమస్యలు తీసుకెళ్లి పరిష్కరించుకుందామన్నారు. సమావేశంలో రాంబుడ్డి గణపతి, బొడ్డు కుమార్,దున్న సత్యం, యు.బ్రహ్మానందం పాల్గొన్నారు.

ఎస్సీ వ్యతిరేక పోరాట సమితి కమిటీల ఎంపిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గాల ప్రతినిధులు

ఇచ్ఛాపురం: ఎస్సీ వ్యతిరేక పోరాటసమితి కమిటీలను మండలం, మున్సిపాలిటీల వారీగా ఏకగ్రీవంగా ఎన్నికున్నారు. బెల్లుపడ రోడ్డులోని ఎల్లమ్మ గుడి ఆవరణలో ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాటంలో భాగంగా ఇచ్ఛాపురం పురపాలక సంఘం, మండలస్థాయిలో కమిటీల ఎంపిక ప్రక్రియను ఎస్సీ నియోజకవర్గ అధ్యక్షుడు సల్లాదేవరాజు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. పురపాలకసంఘం కమిటీ అధ్యక్షులుగా గువ్వాడ దిలీప్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా దడ్ల గిరీష్, ఉపాధ్యక్షులుగా తునియా మాధవరావు, జుత్తు ధర్మారావు, పొడ్ల కిరణ్, సహాయకార్యదర్శిగా లండ శేఖర్, జుత్తు మహేష్, మహిళా అధ్యక్షురాలుగా దీపాల ధనలక్ష్మి, మహిళా ప్రధాన కార్యదర్శిగా దడ్ల రుక్మిణిలు ఎన్నికయ్యారు. అలాగే మండలకమిటీ అధ్యక్షుడుగా కొప్పల హేమంత్, ప్రధాన కార్యదర్శిగా నందూరి శ్రీను, ఉపాధ్యక్షులుగా బడియా గణేష్, సహాయకార్యదర్శిగా దడ్ల చంద్రశేఖర్, నందూరి చలపతి, ఉపాధ్యక్షులుగా తలగాన మోహన్‌రావు, క్రియాశీలక సభ్యులుగా చుక్క మోహన్‌రావు, గౌరవ అధ్యక్షులుగా బర్రు తులసీరావు, గౌరవ సలహాదారునిగా బాగ మోహన్‌రావులు ఎన్నికయ్యారు.

ఉత్సాహంగా మండలస్థాయి గ్రిగ్స్ పోటీలు



క్రీడా జ్యోతి వెలిగించి పోటీలను ప్రారంబిస్తున్న డిప్యూటీ ఈవో విలయమ్

నందిగాం: మండల స్థాయి బాలుర గ్రిగ్స్ పోటీలు దేవళభద్ర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. టెక్కలి డిప్యూటీ ఈవో పి.విలయం పోటీలను ప్రారంభించగా.. టెక్కలి,నందిగాం మండలాలకు చెందిన పీడీలు పోటీలను నిర్వహించారు. బాలురకు జూనియర్, సీనియర్ విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. మండలంలోని 14 ఉన్నత పాఠశాలలు, రెండు గిరిజన ఆశ్రమ పాఠశాలల నుంచి సుమారు 400 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ జూనియర్ విభాగంలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో దేవళభద్ర, దిమ్మడిజోల, సీనియర్ విభాగంలో కవిటి అగ్రహారం, పెద్దబాణాపురం నిలిచాయి. ఖోఖో జూనియర్స్‌లో కవిటి అగ్రహారం, కణితూరు, సీనియర్స్ విభాగంలో కవిటి అగ్రహారం, నందిగాం ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. వాలీబాల్ జూనియర్స్ దిమ్మడిజోల, దేవళభద్ర, సీనియర్ విభాగంలో జయపురం, కణితూరులు మొదటి రెండు స్థానాల్లో నిలిచాయి. అలాగే టెన్నికాయిట్ జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నందిగాం, లఖిదాసుపురం ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలవగా, బ్యాడ్మింటన్ జూనియర్ విభాగంలో లఖిదాసుపురం, దేవళభద్ర, సీనియర్స్ విభాగంలో నౌగాం, లఖిదాసుపురం మొదటి రెండు స్థానాల్లో నిలిచాయని నిర్వాహకులు తెలిపారు. మండల విద్యాశాఖాధికారి జి.నర్సింహులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పూర్ణిమ, ఎస్‌ఎంసీ చైర్మన్ ప్రమీల, మళ్ల బాలక్రిష్ణ పాల్గొన్నారు.

రూ 3.60 కోట్లతో హుద్‌హుద్ ఇళ్ల మరమ్మతులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గంలో గతంలో నిర్మించిన హుద్‌హుద్ ఇళ్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.3.60 కోట్లను మంజూరు చేసిందని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. పలాసలోని తన కార్యాలయంలో విలేకరులతో ఆదివారం మాట్లాడారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి ఇంగిలిగాం, వజ్రపుకొత్తూరు మండలంలోని బెండికొండ సమీపంలో హుద్‌హుద్ ఇళ్లను గతంలో నిర్మించినట్టు చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వీటిని నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఇళ్లకు మరమ్మతులు చేసి లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పాత లబ్ధిదారులు ఇప్పటి వరకు పలు పథకాల్లో లబ్ధి పొందితే వారిని మినహాయించి నూతన లబ్ధిదారులకు అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.

క్షీణించిన పారిశుద్ధ్యం



కాలువలో పడి ఉన్న చెత్త

కంచిలి: మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలకు వెళ్లే మార్గంలో పాత విజ్ఞాన్ స్కూల్ వీధిలో పారిశుధ్య నిర్వహణ దారుణంగా ఉంది. చాలా కాలంగా పంచాయతీ యంత్రాంగం ఈ వీధిలో ఎటువంటి పారిశుధ్య నిర్వహణ పనుల్ని చేపట్టలేదని స్థానికులు వాపోతున్నారు. ఫలితంగా వీధిలో అనారోగ్యకరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. పలువురు సీజనల్ వ్యాధులైన వైరల్ జ్వరాలు, డయేరియా బారిన తరచూ పడి బాధపడుతున్నారు. అలాగే వీధిలైట్లు వెలగకపోవడంతో సాయంత్రమైతే చీకట్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితులపై ఎన్నోసార్లు పంచాయతీ యంత్రాంగానికి ఫిర్యాదు చేసినప్పటికీ ఫలితం లేకపోయిందని అంటున్నారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్యాలయానికి అతి సమీపంలో ఉన్న ఈ వీధిలో సమస్యలపై పట్టించుకోవాలని కోరుతున్నారు.

తలతంపరలో గ్రామసభ



కరపత్రాలు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అశోక్ తదితరులు

కంచిలి: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పరిపాలన పూర్తిచేసుకొని మంచి ప్రభుత్వంగా పేరుతెచ్చుకుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని తలతంపర గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం'కార్యక్రమంలో భాగంగా గ్రామసభను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించి సంబంధిత అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, తహసీల్దార్ వై.జయలక్ష్మి, ఎంపీడీవో వి.నీరజ, స్థానిక సర్పంచ్ డాక్టర్ జగబంధు దొళాయి పాల్గొన్నారు.

చిన్నారుల ఉదారత

కాశీబుగ్గ: విజయవాడ వరద బాధితుల కోసం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు విద్యార్థినులు విరాళాలు సేకరించారు. మదర్‌థెరిసా పాఠశాలకు చెందిన భవ్యశ్రీ, గౌతంక్రిష్ణలు 13 వేల రూపాయలను సేకరించారు. ఈ మొత్తాన్ని ప్రిన్సిపాల్ వజ్జ గంగాభవానీకి ఆదివారం అందజేసి ఆదర్శంగా నిలిచారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డు ఆక్రమణ!



ఆర్‌అండ్‌బీ స్థలాన్ని ఆక్రమించి చదును చేసిన దృశ్యం

పలాస: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని రాజాం కాలనీ సమీపంలో అక్కలగడ్డకు తాళభద్రకు మధ్య ఆర్‌అండ్‌బీ రోడ్డును కొంతమంది ఆక్రమించి పక్కా భవనాల నిర్మాణానికి పూనుకుంటున్నారు. అయితే మున్సిపల్, ఆర్‌అండ్‌బీ అధికారులు దీన్ని పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఆ రోడ్డున వెళ్లే ప్రయాణికులు దీన్ని చూసి ఆశ్చర్యం చెందుతున్నారు. కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే ఒక రోడ్డును, రోడ్డు స్థలాన్ని ఆక్రమించడం చూస్తూ ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం అధికారులు స్పందించకపోవడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ ఆక్రమణపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

తీర ప్రాంతంలో స్వచ్ఛ సాగర్



వజ్రపుకొత్తూరు: దేవునల్తాడ తీరంలో ప్రతిజ్ఞ చేస్తున్న యువకులు



ఇచ్ఛాపురం రూరల్:డొంకూరు తీరంలో ప్రతిజ్ఞ చేస్తున్న యువకులు

వజ్రపుకొత్తూరు: దేవునల్తాడ గ్రామంలో ఆదివారం తీర ప్రాంత పరిశుభ్రతకు స్వచ్ఛ సాగర్, స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం చేపట్టారు. పలాస-కాశీబుగ్గ బ్లాక్ పరిధిలోని దేవునల్తాడలో సర్పంచ్ టి.వరదరాజు ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం నేషనల్ యూత్ వాలంటీర్ ఎం.గిరి 50 మంది యువకులతో కలిసి తీరంలోని చెత్తను తొలగించారు. 100 కిలోల చెత్తను సేకరించారు. ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ వాటిని సముద్రంలో కలవకుండా తీసుకోవాల్సిన చర్యలపై యువతకు అవగాహన కల్పించారు. అనంతరం వారిచే ప్రతిజ్ఞ చేయించి తీరప్రాంతాన్ని స్వచ్ఛంగా, పరిశుభ్రంగా ఉంచుదామన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ సంఘాలు, మహిళలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు సాగరతీరంలో స్వచ్ఛ తీరం కార్యక్రమాన్ని యువకులు నిర్వహించారు. ఈ సందర్భంగా నేషన్ యూత్ వలంటీర్ హంగీర్ బెహరా మాట్లాడుతూ.. సముద్ర తీరాన్ని కాలుష్య రహితంగా ఉంచుకోవాలన్న ఉద్దేశ్యంతో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 'స్వచ్ఛ సాగర్..సురక్షిత్ సాగర్'పేరిట వ్యర్థాలను తొలగించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈదుపురం ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

నర్సిపురంలో జంగిల్ క్లియరెన్స్

నందిగాం: మండలంలోని నర్సిపురంలో ఆదివారం జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. స్థానిక సర్పంచ్ పొందల లక్ష్మణరావు ఆధ్వర్యంలో గ్రామం నుంచి శాసనాం కాలనీ వరకు రోడ్డు కిరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి రహదారిని శుభ్రం చేశారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

టెక్కలి రూరల్: పరశురాంపురం జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్నారనే సమాచారం మేరకు టెక్కలి ఎస్ఐ వెంకటేశ్వరరావు తన సిబ్బందితో ఆదివారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆదే గ్రామానికి చెందిన పల్లి శ్యామలరావు తన షాపులో అక్రమంగా మద్యం ఉంచినట్టు గుర్తించారు. ఇతని వద్ద నుంచి ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ముగ్గురు జూదరులు అరెస్ట్

ఇచ్ఛాపురం రూరల్: జూదమాడుతున్న ముగ్గురిని ఇచ్ఛాపురం రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. మండపల్లి సరిహద్దులో కొంతమంది జూదం ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆదివారం రాత్రి రూరల్ ఎస్ఐ ఇ.శ్రీనివాస్ బృందితో వెళ్లి దాడి చేశారు. ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 6,270 రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.